సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024

మధుర 'జ్ఞాపకం-29'

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5 గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుంది. అంటే 365 రోజులతో పాటు మరోపావు రోజు అవుతుందన్నమాట. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి.. నాలుగేళ్లలో నాలుగు పావురోజుల్ని కలిపితే ఒక రోజు అవుతుంది. ఆ ఏడాదినే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరి నెలలో పూర్తవుతుంది. అంటే ఆ నెలలో 28కి బదులు 29 రోజులు వస్తాయి. ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే ఈ సంవత్సరం ఫిబ్రవరిలో 29 రోజులుంటాయి. ఈరోజు పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ఇదేరోజు పుట్టినవారు, పెళ్లి చేసుకున్న వారు బర్త్‌డే.. వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకునేందుకు నాలుగేళ్లు ఎదురు చూస్తారు. గురువారం లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. పలువురి అభిప్రాయాలు...

-8లో..



న్యూస్‌రీల్

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోల బదిలీ


ఎస్.ఆనంద్‌కుమార్


మధుసూదన్

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్‌ను కోరుట్ల ఆర్డీవోగా, వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌ను జగిత్యాల ఆర్డీవోగా బదిలీ చేశారు. వారి స్థానంలో హన్మకొండ ఆర్డీవోగా పని చేస్తున్న ఎల్.రమేశ్‌ను సిరిసిల్ల ఆర్డీవోగా, కోరుట్ల ఆర్డీవోగా పనిచేస్తున్న ఎస్.రాజేశ్వర్‌ను వేములవాడ ఆర్డీవోగా నియమించారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పొలాలు పరిశీలన


వరి పొలం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం కొత్తపల్లి, లింగన్నపేట గ్రామాల్లోని వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు, జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిలకదశలో ఉన్న వరి పైరులో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు, క్లోరంట్రానిలిప్రోల్ 4జీ గుళికలు, 20–25 కిలోల ఇసుకలో కలిపి చల్లాలన్నారు.

బీఆర్‌ఎస్‌కు బోయినపల్లి ఎంపీపీ రాజీనామా


వేణుగోపాల్

బోయినపల్లి(చొప్పదండి): బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు పంపినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కొందరు పార్టీ మండల అధ్యక్షుడితో కలిసి తనపై అవిశ్వాసం పెట్టినందుకు నిరసనగా బీఆర్‌ఎస్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి విలాసాగర్ ఎంపీటీసీగా రెండు సార్లు గెలిచి 2014లో వైస్ ఎంపీపీగా, 2019 నుంచి ఎంపీపీగా పని చేస్తున్నట్లు తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు ప్రకటించిన అవిశ్వాసంలో కాంగ్రెస్ ఎంపీటీసీల మద్దతుతో ఎంపీపీ వేణుగోపాల్ అవిశ్వాస గండం నుంచి గట్టెక్కారు. త్వరలో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

సాగునీటి కోసం రైతుల ఆందోళన


ఇల్లంతకుంటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట రైతులు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అంతగిరి ప్రాజెక్టు నుంచి అనంతారం చెరువులోకి సాగునీరు విడుదల చేయాలని కోరారు. వాగు ద్వారా రహీంఖాన్‌పేట చెరువులోకి నీరు వస్తుందని తద్వారా పంటలకు సాగునీరు అందుతుందని, లేనిపక్షంలో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇల్లంతకుంట పోలీసులు చేరుకుని రైతులను శాంతింపజేశారు.

నేడు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా జాతర

- రాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి
- శ్రీశైలం తరహా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం రాజన్న ఆలయం ఓపెన్ స్లాబ్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మార్చి 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు జరుపుకునే జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆలయంలో జరిగే పూజల్లో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని సూచించారు. భక్తులకు త్వరగా దర్శనం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, మహాలక్ష్మి పథకం నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అకాశం ఉంటుందని, రద్దీకి అనుగుణంగా డిపో మేనేజర్లు సమన్వయం చేసుకుంటూ అదనపు సర్వీసులు నడపాలన్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాల్లో రైతుల సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పది కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్లలో


ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి

గుంతలు పూడ్చివేయాలని, రోడ్డుకిరువైపుల పిచ్చి మొక్కలను తొలగించాలని, రోడ్ల పక్కన ఉన్న బావులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని, దానికోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతర అనంతరం వేములవాడ శైవక్షేత్రాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భవిష్యత్‌లో భక్తుల సహాయంతో వేములవాడలో నిత్యం స్వామిని దర్శించుకునే భక్తులకు ప్రతీరోజు అన్నదానం చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని అన్నారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వేములవాడను సిద్ధం చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత, దుర్వాసన ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశం అనంతరం ఆలయంలో భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీరు ఎట్లుండ్రు.. మీకేం చేయాలి


సిరిసిల్ల పెద్దూరులో గల్ఫ్ బాధితుల కుటుంబాలతో కేటీఆర్

- మా ప్రభుత్వం ఉంటే అల్కగా చేస్తుంటి
- మీరు ఏ పనిచేస్కుంటమన్నా చూస్కుంటా..
- గల్ఫ్ జైళ్ల నుంచి మీరు వచ్చిండ్రు.. సంతోషం
- గల్ఫ్ బాధితులతో ఎమ్మెల్యే కేటీఆర్ మాట.. ముచ్చట

సిరిసిల్లటౌన్: మీ గోస.. గోస కాదు.. మిమ్మల్ని తీసుకురావడానికి శత విధాలుగా ప్రయత్నించినం.. ఇన్నేళ్లకు తీరింది..ఇప్పుడు మీరు ఎట్లుండ్రు.. మీ పోషణకు నేనేం చేయాలి.. అంటూ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. పద్దెనిమిదేళ్ల జిల్లాకు చెందిన నలుగురు గల్ఫ్‌లో బందీలై విడుదలైన వారిని సిరిసిల్ల శివారులోని పెద్దూరులో బుధవారం కలుసుకుని మాట్లాడారు. 12 ఏళ్లు ఎంతో కష్టపడితే గానీ మీరు జైళ్ల నుంచి బయటకు రాలేదు.. ఇప్పటికీ ఆలస్యమైంది కానీ.. ఏడేళ్ల ముందు వచ్చిండ్రు.. ఇలా మీ ఇంటోళ్లను కలుసుకుండ్రు అన్నారు. మొదటిసారి 2012లో మీరు గల్ఫ్ జైళ్లో పడిన సంగతి తెలిసిందన్నారు. పెద్దూరు పెద్దమనుషులు, ఇతరులు నాతో మాట్లాడిండ్రు మీకు ఎలా సాయం చేయాలనేది ఏంతెల్వదు.. ఇంతలోనే రాజశేఖర్ సార్, నారాయణ తదితరులు సాయం చేయడానికి ముందుకు వచ్చిండ్రని తెలిపారు. మీ కేసులో మిమ్మల్ని శిక్ష నుంచి తప్పించడానికి అక్కడ మృతి చెందిన కుటుంబసభ్యులకు బ్లడ్ మనీ చెల్లించాల్సి ఉంటుందని తెలుసుకున్నం. ఆ కుటుంబసభ్యులకు వాటిని అందించడానికి మేము నేపాల్ వచ్చినం. మృతుడి భార్య పిల్లలు ఖాట్మాండు నుంచి 24గంటలు ప్రయాణం చేసి వచ్చిండ్రు పాపం అని వివరించారు. వాళ్లకు పైసలిచ్చినం..అయినా ఇన్నేళ్లు జైల్లో ఉన్నారు.. మీరు వచ్చిండ్రు అదిచాలు.. ఇక ఇక్కడే ఉండి పనిచేసుకోండ్రి నావంతుగా మీరు పనిచేసుకోవడానికి సాయం చేస్తాని హామీ ఇచ్చారు. మీకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం..అయితే మన ప్రభుత్వం ఉంటే మీకు నేను ఏదైనా చేయడానికి అల్కగా ఉంటుండే అన్నారు. మీరు ఏపని చేసుకుంటారో నాకు చెప్పాలని కోరారు. గంట సేపు బాధిత కుటుంబాల సభ్యులతో ఆయన గడిపారు.

ఎక్కడికో పోయి ఇబ్బంది పడొద్దు

మన రాష్ట్రం నుంచి లక్షలాది మంది ఓయాసిస్సులు దాటి దుబాయ్ వంటి దేశాలకు వెళ్లి ఇబ్బందులు పాలైతున్నారని ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. పెద్దూరులో గల్ఫ్ బాధితులను పరామర్శించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నో ఉపాధి అవకాశాలున్నా ఉపాధి కోసం లక్షల సంఖ్యలో వెళ్లి ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన జిల్లాకు చెందిన నలుగురు గల్ఫ్‌లో జైల్లో పడ్డ బాధితులను ఉదాహరణగా తీసుకుని స్థానికంగానే ఉపాధి మార్గాలు వెతుక్కోవాలని సూచించారు. కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులున్నారు. బాధితుల కన్నీళ్లు..వారి కృతజ్ఞతలతో కేటీఆర్ కన్నీటి పర్యంతమై వారికి అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం బాధిత కుటుంబాల్లో ధైర్యాన్ని నింపింది.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. తన గెలుపులో కీలక పాత్ర పోషించిన మేధావులు, అడ్వకేట్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్వకేట్లు తమ సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ఏజీపీ గుడిసె సదానందం, అడ్వకేట్లు నేరెళ్ల తిరుమలగౌడ్, పురుషోత్తం, పాత్తూరు అనిల్‌కుమార్, రేగుల దేవేందర్, నగుబోతు విష్ణుకుమార్, గడ్డం సత్యనారాయణరెడ్డి, పిల్లి మధు, నేదూరి అభిలాష్, రాజూరి రమేశ్, రేగుల రాజ్‌కుమార్, బొడ్డు ప్రశాంత్, శంకర్, అవధూత రజనీకాంత్, బొజ్జ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

7న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మార్చి 7న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అన్వేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం 4న గెజిట్ విడుదల చేసి 7న ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే జరగాల్సిన వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో పలువురు కౌన్సిలర్లు పార్టీలు మారడం, మిగతా వారు ఆసక్తి కనిపించకపోవడంతో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక చర్చనీయాంశమైంది.

ఉద్యోగ విరమణ వృత్తికే.. సేవకు కాదు

- ఎస్పీ అఖిల్ మహాజన్


రవీందర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఉద్యోగ విరమణ సాధారణ అంశమని, విరమణ వృత్తికి తప్ప సేవాగుణానికి కాదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా 33ఏళ్లు విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ పొందుతున్న రవీందర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో పూలమాల వేసి సన్మానించారు. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారంటూ శుభాకాంక్షలు తెలియజేస్తూ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్మడ్ డీఎస్పీ గంగాధర్, ఆర్ఐ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి


విద్యార్థుల ప్రాజెక్టులు పరిశీలిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను పరిశీలించారు. విద్యార్థులను విద్యనభ్యసించడంతో పాటు వారికున్న సందేహాలపై ప్రశ్నించడంతోనే ప్రతిభకు నాంది పలికినట్లు అవుతుందన్నారు. విజ్ఞాన వేదిక నాయకులు రామరాజు, శ్రీహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండాలి

విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి సైన్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండాలని, దీనికి ఉపాధ్యాయులు బాటలు వేయాలని అప్పుడే మూఢనమ్మకాలు సమాజం నుంచి ప్రాలదోలబడతాయని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. బుధవారం వెంకంపేట పాఠశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంకు హాజరై సైన్స్ గొప్పతనాన్ని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి దేవయ్య మాట్లాడుతూ జిల్లాలో వివిధ స్థాయిలలో పరిశోధనలు విద్యార్థులు ఆలోచన విధానాలు సరికొత్తపంథాలో ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మూఢనమ్మకాలను దూరం చేయడానికి కామారెడ్డి నుంచి మెజీషియన్ రప్పించి ప్రాక్టికల్‌గా వివరించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


పరీక్ష కేంద్రంలోకి పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థి


సిరిసిల్లలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


హాల్‌టికెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు ఫస్టియర్‌లో జనరల్ 3,858 విద్యార్థులకు 3,704 మంది, ఒకేషనల్ 451 విద్యార్థులకు 421 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ తెలిపారు. 89శాతం హాజరు నమోదైందని అన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను రక్షించాలి

- నేత కార్మికులు, ఆసాములకు ఉపాధి కల్పించాలి
- మాజీ శాసనమండలి సభ్యుడు చెరుపల్లి సీతారాములు
- సిరిసిల్లలో 'నేతన్నల ఆకలి కేక-మహా ధర్నా'


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు


సిరిసిల్లలో మహాధర్నా నిర్వహిస్తున్న నేత కార్మికులు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలని, నేతన్నలకు పని కల్పించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ, సీఐటీయూతో ఆధ్వర్యంలో నేత కార్మికులు, ఆసాములు, వస్త్రపరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులు 'నేతన్నల ఆకలి కేక-మహాధర్నా' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సీతారాములు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాకం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. ఇప్పుడు వస్త్ర పరిశ్రమ మూతపడడంతో ఉపాధి లేక పవర్‌లూమ్ కార్మికులు, ఆసాములు వైపని, వార్పిన్, గుమస్తాలు, జాఫర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించి, వాటికి సంబంధించిన బకాయిలను ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం నుంచి రూ.482 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. జనవరి నెలలో ఇవ్వాల్సిన బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇంకా ఇవ్వలేదన్నారు. సిరిసిల్లలో ఉపాధి లేక కార్మికులు దిక్కులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. నేతన్నలు ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్‌లు అసెంబ్లీలో ఇటు పార్లమెంటులో ప్రజాక్షేత్రంలో స్పందించకపోవడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కులు, చట్టాలను కాలరాస్తున్నదన్నారు. జాతీయ టెక్స్‌టైల్ బోర్డును రద్దు చేసిందని, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, హౌస్ కం వర్క్ షెడ్ వంటి తదితర పథకాలను రద్దు చేసిందన్నారు. సిరిసిల్లలో కార్మికులకు నిరంతరం అండగా ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల సంక్షోభ నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆసాముల సంఘం అధ్యక్షులు సిరిసిల్ల రవి, కార్యదర్శి చేరాల అశోక్ పాల్గొన్నారు. సిరిసిల్ల డీఎస్పీ భీమ్‌శర్మ, టౌన్ సీఐ రఘుపతి, ఎస్ఐలు శ్రీనివాస్‌రావులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

సిరిసిల్లలో ప్రదర్శన.. మానవహారం

సిరిసిల్ల వీధుల్లో నేతన్నలు ఎర్ర జెండాలతో ప్రదర్శన చేశారు. మానవహారం నిర్వహించారు. అంతకు ముందు నేతన్న చౌక్‌లో నేతన్న విగ్రహానికి పూలమాల వేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ఆసాముల సంఘం సహాయ కార్యదర్శి మండల రాజు, సీపీఎం నాయకులు జవ్వాజి విమల, సూరం పద్మ, సీఐటీయూ నాయకులు మోర అజయ్, అన్నల్‌దాస్ గణేశ్, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, వైపని యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఆడెపు సంపత్, ఒగ్గు గణేష్, నక్క దేవదాస్, గుండు రమేశ్, గోవింద్ లక్ష్మణ్, బెజిగం సురేశ్, కంది మల్లేశం, గడ్డం రాజశేఖర్, గోనె పరశురాములు, కనకయ్య, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లీప్ ఇయర్ అంటే ఏమిటి?

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుందని అంచనా. అంటే 365 రోజులతోపాటు మరో పావు రోజు. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి ప్రతీ నాలుగేళ్లలో నాలుగు పావు రోజుల్ని కలిపితే ఒకరోజు అవుతుంది. దీన్ని చేర్చిన ఇయర్‌నే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఇలా నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలలో 28కి బదులుగా 29 రోజులు వస్తాయి.



లీప్ డే..సందడే

- నాలుగేళ్లకోసారి వచ్చే ఫిబ్రవరి 29 స్పెషల్..
- లీపు సంవత్సరంలో పుట్టిన, వివాహం చేసుకున్నవారిలో సంతోషం
- బర్త్‌డే, మ్యారేజ్ డేకు ఏర్పాట్లు

కోల్‌సిటీ(రామగుండం): సాధారణ సంవత్సరంలో 365 రోజులు, లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన ఏడాది మాత్రం ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ ఇయర్ అందరికీ కామన్ అయినా... కొందరికి మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. ఫిబ్రవరి 29న పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ప్రపంచంలో ఇలాంటివారు సుమారు 40 కోట్ల మంది ఉన్నారని అంచనా. ఈ రోజున పుట్టినవారు, పెళ్లి చేసుకున్న వారు తమ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలు జరుపుకునేందుకు నాలు గేళ్లు ఎదురు చూస్తారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం లీప్ డే రానే వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్ డేను ఘనంగా జరుపుకునేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నేడు లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం...

మా కుమారుడి రెండో బర్త్‌డే


నిర్వాన్‌తో తల్లిదండ్రులు ఎల్లేశ్-వనిత

కోల్‌సిటీ: మాది గోదావరిఖని ఎల్బీనగర్. మాకు 2016 ఫిబ్రవరి 29న స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కుమారుడు జన్మించగా నిర్వాన్ అని పేరు పెట్టాం. లీప్ ఇయర్ కావడంతో నాలుగేళ్ల క్రితం ఫస్ట్ బర్త్ డే చేశాం. గురువారం రెండో బర్త్‌డే చేసేందుకు ఎదురుచూస్తున్నాం.

– నమిండ్ల ఎల్లేశ్-వనిత, గోదావరిఖని

మొదటి పుట్టినరోజు..


శ్రీయన్‌నంద్‌తో తల్లి దండ్రులు మధుకర్-స్రవంతి

కోల్‌సిటీ: మాది రామగిరి మండలంలోని రత్నాపూర్. మాకు 2020 ఫిబ్రవరి 29న కొడుకు పుట్టగా శ్రీయన్‌నంద్ అని పేరు పెట్టాం. నేను జేఎన్టీయూలో, నా భార్య స్రవంతి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తోంది. గురువారం మా కుమారుడి మొదటి పుట్టినరోజు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. చాలా థ్రిల్‌గా ఉంది. 100 మంది నిరుపేద చిన్నారులకు అన్నదానం చేయడానికి హైదరాబాద్‌లోని థాగమ్ ఫౌండేషన్‌కు విరాళం పంపించాం.

– మధుకర్-స్రవంతి

ఎనిమిదో పెళ్లిరోజు..


కుమారుడు, కూతురితో రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి

ఎలిగేడు(పెద్దపల్లి): మాకు 1992 ఫిబ్రవరి 29 న వివాహమైంది. నేను కిరాణాషాపు నిర్వహిస్తున్న. నా భార్య జ్యోతిలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కుమారుడు వైభవ్, కూతురు వెష్ణవి ఉన్నారు. మా 32 ఏళ్ల వివాహ జీవితంలో గురువారం ఎనిమిదో పెళ్లిరోజు జరుపుకుంటున్నాం. సంతోషంగా ఉంది.

– రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి, ఎలిగేడు

నేటితో 64 ఏళ్లు..


భర్త రాజిరెడ్డితో లక్ష్మి

విద్యానగర్(కరీంనగర్): మేము కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో ఉంటాం. నా పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని తెలియదు. మా మనవడు నా స్కూల్ సర్టిఫికెట్లు ఒకసారి చూసినప్పుడు నేను ఫిబ్రవరి 29, 1960న పుట్టినట్లు తెలిసింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులందరూ గుర్తుపెట్టుకొని, నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ గురువారంతో నాకు 64 ఏళ్లు నిండుతాయి. మా ఆయన రాజిరెడ్డి, కుటుంబసభ్యులు వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

– ముస్కుల లక్ష్మి, సప్తగిరికాలనీ, కరీంనగర్

ఈ రోజు మా పెళ్లి..



బోయినపల్లి(చొప్పదండి): ఈ రోజు మా పెళ్లి.. లీప్ ఇయర్ ఫిబ్రవరి 29న దాంపత్య జీవితంలోకి అడుగు పెడుతుండటం ఆనందంగా ఉంది. మా ఇద్దరిదీ ఒకే ఊరు బోయినపల్లి మండలంలోని తడగొండ. నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు వస్తుందని తెలిసి, కొత్త అనుభూతి కలుగుతోంది.

– తేజస్వీ-ప్రదీప్‌రెడ్డి, తడగొండ, బోయినపల్లి

మరిచిపోలేనిది..


దువ్వాక మల్లేశం-స్వప్న, రాయికల్

రాయికల్(జగిత్యాల): మాది రాయికల్. మా వివాహం 29-02-2004న జరిగింది. నాలుగేళ్లకోసారి మా పెళ్లిరోజు నిర్వహించుకోవడం జీవితంలో మరిచిపోలేనిది. ఈ రోజు అనాథలకు భోజనం పెడతాం. మా కుమారుడు మల్లికార్జున్, కూతురు తేజస్విని పుట్టిన రోజు కూడా ఇదే నెల 5, 28వ తేదీలు.

ముహూర్తం మళ్లీ రాదని..



తిమ్మాపూర్(మానకొండూర్): మాది తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం. నేను భూపాల్‌పల్లి ఎంఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నాకు సైదాపూర్ మండలంలోని అగ్రహారం కుర్మపల్లి చెందిన మనస్వితో పెళ్లి నిశ్చయమైంది. గురువారం నాటి ముహూర్తం మళ్లీ రాదని పండితులు చెప్పడంతో వివాహం చేసుకుంటున్నాను.

శివరాసన్-మనస్వి, మొగిలిపాలెం, కుర్మపల్లి

అప్పట్లో మాకు తెలియదు..



విద్యానగర్(కరీంనగర్): మా పెళ్లి లీప్ ఇయర్‌లో జరుగుతోందని, నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు జరుపుకుంటామని అప్పట్లో మాకు తెలియదు. ఆరోజు మంచి రోజు ఉందని ఫిబ్రవరి 29, 1964న పెద్దలు వివాహం చేశారు. తర్వాత తెలిసింది మా మ్యారేజ్ డే ప్రతీ సంవత్సరం రాదని. మాది సిరిసిల్ల. నేను సిరిసిల్ల శాంతినగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్‌గా జూన్ 2000లో రిటైరయ్యాను. గురువారం మా పెళ్లి రోజు. వివాహమై, 60 ఏళ్లవుతున్న సందర్భంగా మా మనవళ్లు, మనవరాళ్లు షష్టి పూర్తి చేస్తున్నారు.

చిట్నేని శ్రీనివాసరావు-నీరజ, సిరిసిల్ల

36 ఏళ్లు.. తొమ్మిదో పుట్టిన రోజు


కుటుంబసభ్యులతో సందీప్

కోరుట్ల: మాది కోరుట్ల. నేను లీపు సంవత్సరం ఫిబ్రవరి 29, 1988లో జన్మించాను. అప్పటినుంచి ఈరోజు వరకు లెక్కతీస్తే సరిగ్గా తొమ్మిదో పుట్టిన రోజు జరుపుకోబోతున్న. నాన్న లక్ష్మీనారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యారు. అమ్మ స్వరూప. నేను ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ముంబయిలో ఉద్యోగం చేస్తున్న. నాలుగేళ్లకోసారి వచ్చే పుట్టినరోజును కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకుంటున్న. ఈసారి అమ్మానాన్న, బంధువులు రెండు రోజుల ముందే నా వద్దకు వచ్చారు.

– తుంగూరి సందీప్‌కుమార్, కోరుట్ల

వయసు 16.. బర్త్‌డే నాలుగోది



గంగాధర(చొప్పదండి): నా వయస్సు 16 ఏళ్లు. బర్త్‌డే మాత్రం నాలుగోదే. మాది గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల. నేను 29 ఫిబ్రవరి 2008న జన్మించాను. అందరికన్నా భిన్నంగా నాలుగేళ్లకోసారి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది.

– దోమకొండ వర్షిణి, ఉప్పరమల్యాల, గంగాధర

మ్యారేజ్ డేకు మస్కట్ నుంచి వస్తా..



కథలాపూర్(వేములవాడ): మాది కథలాపూర్ మండలంలోని చింతకుంట. 2004 ఫిబ్రవరి 29న సంధ్యారాణిని పెళ్లి చేసుకున్న. నేను మస్కట్‌లో ఉంటున్న. నాలుగు సంవత్సరాలకోసారి వచ్చే పెళ్లి రోజును స్వగ్రామం వచ్చి, కుటుంబసభ్యులు, బంధుమిత్రుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

– చెదలు ప్రసాద్, చింతకుంట, కథలాపూర్

ఏటా జరుపుకునే చాన్స్ లేదు



అందరూ ఏటా తమ పుట్టిన రోజు జరుపుకుంటారు. కానీ నాకు ఆ చాన్స్ లేదు. నా బర్త్‌డే లీప్ డే కావడంతో ఎదురుచూస్తూ ఉంటా. ఒక్కోసారి అందరిలా ఏడాదికోసారి జరుపుకుంటే బాగుండు అనిపిస్తుంది. కానీ, నాలుగు సంవత్సరాలు వేచిచూడటం ప్రత్యేకం అనుకుంటాను. నేను రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను.

– ఏనుగు రజిత, స్కూల్ అసిస్టెంట్, రాయికల్

నేడు ఏడడుగులు వేస్తున్నాం..


సాయిచంద్-శిశరూప

గంగాధర(చొప్పదండి): ముహూర్తం కలిసి రావడంతోపాటు ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకోవడం ప్రత్యేకంగా ఉంటుందని ఈ రోజు మేము ఏడడుగులు వేస్తున్నాం. మాది గంగాధర మండంలోని ఉప్పరమల్యాల. ఉద్యోగరీత్యా జర్మనీలో ఉంటున్న. హైదరాబాద్‌కు చెందిన శిశిరూపను గురువారం పెళ్లి చేసుకుంటున్న.

– గౌరిశెట్టి సాయిచంద్-శిశరూప, గంగాధర

అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా వివాహం 2004 ఫిబ్రవరి 29న జరిగింది. మొదటి పెళ్లిరోజు జరుపుకునేందుకు నాలుగేళ్లు పట్టింది. చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాం. గురువారం ఐదో పెళ్లి రోజు. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. వేడుకలకు రెడీ అయ్యాం. అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం.

– కోడూరి రజని-సత్యనారాయణ, కోతిరాంపూర్, కరీంనగర్

2020లో అమ్మతో కేక్ కట్ చేశా..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా సొంతూరు వేములవాడ. కానీ, కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాం. ప్రస్తుతం కోతిరాంపూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. 1972 ఫిబ్రవరి 29న పుట్టాను. ఇప్పటివరకు 13 సార్లు బర్త్‌డే జరుపుకున్న. 2020లో మా అమ్మతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేశా. ఇప్పుడు అమ్మ లేదు. బాధగా ఉంది.

– రాగంపేట చంద్రశేఖర్‌రావు, కరీంనగర్

నేడు ఒక్కటవుతున్నాం..



విద్యానగర్(కరీంనగర్): ఈరోజు మంచి రోజు అని ముహూర్తం నిర్ణయించి, పెళ్లి చేస్తున్నారు. మా ఊరు సుల్తానాబాద్ దగ్గర ముప్పిరితోట. అమ్మాయిది కరీంనగర్. నేను ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. మాది పెద్దలు కుదిర్చిన వివాహమే. గురువారం తీగలగుట్టపల్లిలోని రంగినేని గార్డెన్స్‌లో పెళ్లితో ఒక్కటవుతున్నాం.

భరత్‌కుమార్ గౌడ్- కావ్యశ్రీఫణి

నేడు మా వివాహం..


శివాణి-సతీశ్

బోయినపల్లి(చొప్పదండి): అనుకోకుండా లీ పు సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీనే మా వివాహం జరుగుతుండటం థ్రిల్లింగ్‌గా ఉంది. మాది గంగాధర మండల కేంద్రం. శివాణిది బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి గ్రామం. మేము మా పెళ్లిరోజును నాలుగేళ్లకోసారి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం.

– శివాణి-ఇప్పులపల్లి సతీశ్, దేశాయిపల్లి, గంగాధర

29వ తేదీనే ఎంచుకున్నాం..



కోల్‌సిటీ(రామగుండం): మాది గోదావరిఖని మార్కండేయకాలనీ. ప్రస్తుతం కరీంనగర్‌లో ఉంటున్నాం. నేను గణిత శాస్త్రంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్నాను. 1992లో మాధవిని పెళ్లి చేసుకున్న. ఫిబ్రవరి 27, 29 తేదీలు మంచి రోజులని పండితులు చెప్పారు. మేము లీప్ డే అంటే వెరైటీగా ఉంటుందని 29ని ఎంచుకున్నాం. నాలుగేళ్లకోసారి వచ్చే పెళ్లిరోజును సంతోషంగా జరుపుకుంటున్నాం.

– ఆయంచ జవహర్‌బాబు-మాధవి, గోదావరిఖని

మా పాప బర్త్‌డే ప్రత్యేకం


ఆరాధ్యను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మాది ధర్మారం మండలం కొత్తూరు. మా కూతురు ఫిబ్రవరి 29న జన్మించింది. నాలుగేళ్లకోసారి బర్త్‌డేను ఘనంగా జరుపుతున్నాం. గురువారం రెండో పుట్టిన రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– నెరువట్ల మహేందర్ -శ్రీలత, కొత్తూరు

అందరికీ గుర్తుంటుంది..



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మాది పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్. నా వివాహం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన వడ్లకొండ స్నేహతో నిశ్చయమైంది. పెళ్లి యాధృచ్చికంగా గురువారమే నిశ్చమైంది. లీప్ డే కావడంతో మా పెళ్లిరోజు బంధుమిత్రులందరికీ గుర్తుంటుంది.

– గోలి హరీశ్-స్నేహ, కాల్వశ్రీరాంపూర్, చెప్యాల

52వ యేట.. టీనేజ్‌లోకి..


బర్త్‌డే కేక్‌తో రమణకుమార్

మంథని: మాది మంథని. నేను న్యాయవాద వృత్తిలో ఉన్నాను. 1972 ఫిబ్రవరి 29 జన్మించాను. గురువారం 13వ బర్త్‌డే జరుపుకుంటున్న. 52వ యేట.. టీనేజ్‌లోకి అడుగుపెడుతున్నానని సంతోషంగా ఉంది. పుట్టినరోజు వేడుకను కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో జరుపుకుంటా.

– చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, మంథని

భూ కబ్జాదారుడిపై కేసు

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలంలో భూ కబ్జాకు పాల్పడిన పెద్దూరు తిరుపతిపై బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గజభింకర రాధాబాయి 1996లో భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగా ఇటీవల పెద్దూరు తిరుపతి ఆమెను బెదిరించి భూమిని ఆక్రమించుకున్నారన్నారు. రాధాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిపై తంగళ్లపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టపరిధిలో భూమి కొనుగోలు చేయకుండా డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేసే వారిపై బాధితులు నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్:మద్యానికి బానిసైన మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన పెడికం వెంకటేశ్ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం భద్రాదికొత్తగూడెం జిల్లాకు చెందిన వెంకటేశ్ తొమ్మిదేళ్ల క్రితం భార్య గంగమణితో కలిసి గ్రామానికి వలస వచ్చాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య మందలిస్తున్నా మార్పు రాలేదు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చాడు. భార్య వారించగా.. ఇకపై మద్యం తాగనని చెప్పి బయటకు వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

‘శ్రీచైతన్య’లో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి డిస్ట్రిక్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ బోర్డుతో కలిసి ఎస్ఎస్ఎస్ బ్యానర్ కింద ×రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ఎం.రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రోగ్రాం మేనేజర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ-ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. కేయూ హెచ్‌వోడీ ప్రొఫెసర్ నర్సింహారావు జీవిత నైపుణ్యాలు ఉదాహరణలతో విద్యార్థులకు తెలియజేశారు. క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ ఎలా పెంపొందించుకోవాలి వివరించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ విద్యార్థిగా సంతోషకరమైన జీవితాన్ని ఎలా గడపాలో పరీక్షా సమయంలో ఒత్తిడిని ఎలా అధిగమించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డైరెక్టర్ కె. నరేందర్‌రెడ్డి, హెచ్‌ఐవీ-ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మెరుగైన కెరీర్ కోసం జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు దృక్పథం ఎలా మార్చుకోవాలి అనే అంశంపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు సూచనలను చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మంత్రి ‘పొన్నం’ పూజలు


నాంపల్లి శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ శ్రీనివాస్

వేములవాడ/వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రచారి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

వేములవాడ మండలం కొడుముంజలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం, శ్రీమల్లికార్జున స్వామి ఆలయం నిర్మాణాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మాజీ సర్పంచ్ కదిరె రాజు కుమార్, నాయకులు ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాసరావు, పండుగ ప్రదీప్, సత్తయ్య, నరేందర్, ప్రశాంత్, ఆగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్



నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్టు చూపిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ: బోయినపల్లికి చెందిన నకిలీ గల్ఫ్ ఏజెంట్ పెగ్గెర్ల చంద్రశేఖర్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. చంద్రశేఖర్ ఎటువంటి అనుమతి లేకుండా కోనాయిపల్లిలో ఆఫీసు పెట్టుకొని ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం గల్ఫ్ దేశాలకు పంపుతానని అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని వారిని గల్ఫ్ దేశాలకు పంపకుండా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కొనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన మల్యాల దుగ్గయ్యను ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ దేశానికి పంపిస్తానని, నెలకు రూ.లక్ష జీతం అని నమ్మించి అతడి వద్ద రూ.2.75 లక్షలు వసూలు చేశాడని తెలిపారు. డబ్బులు తీసుకొని రెండేళ్లయినా ఉక్రెయిన్‌కు పంపకుండా అడిగిన ప్రతిసారి మాట దాటవేస్తుండటంతో దుగ్గయ్య వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈమేరకు విచారణ జరిపి అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ కరుణాకర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గల్ఫ్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లే వారు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. ఇప్పటివరకు గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితులు, నకిలీ గల్ఫ్ ఏజెంట్ల సమాచారం ఉన్న వారు స్పెషల్ బ్రాంచ్ సీఐ 8712656411 నంబర్‌కు పూర్తి వివరాలు అందించాలని కోరారు.